

# అజాత శత్రువు.. ముండ్రాతి సమ్మయ్య

- ఎల్‌డీసీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ దాకా సేవలు
- ఉద్యోగుల భవిష్యనిధి (పీఎఫ్) శాఖలో రాణింపు
- సేవా గుణానికి ప్రతిరూపం..
- సేవే పరమావధి.. నిజాయితీకి నిలువుటద్దం..
- ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రత్యేక కథనం 7వ పేజీలో..


వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 167
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
మార్చి 29, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net






# 'విశ్వావసు' కి స్వాగతం

తెలుగు వారి క్యాలెండర్ ఉగాది నుంచి ప్రారంభం అవుతుంది. ఈ తెలుగు నూతన సంవత్సరం మొదటి రోజుని ఉగాదిగా జరుపుకుంటాం. దీనికి కారణం ప్రకృతి సహజత్వం. మనిషి ప్రకృతికి, కాలానికి అనుగుణంగా జీవిస్తున్నాడు కనుక ప్రకృతి నూతనంగా మారినప్పుడు.. మనిషి జీవన విధానం కూడా నూతనంగా మొదలవుతుంది. ఉగాదిని యుగాది అని కూడా అంటారు. అంటే సృష్టి ప్రారంభం అయిన రోజు. చైత్రశుక్ల పాడ్యమినాడు విశాలవిశ్వాన్ని బ్రహ్మదేవుడు సృష్టించాడు కనుక సృష్టి ఆరంభానికి సంకేతంగా ఉగాది జరుపుకుంటామని ప్రశస్తి. హిందూ పంచాంగం ప్రకారం ఒక్కో తెలుగు సంవత్సరానికి ఒక్కో పేరు చొప్పున మొత్తం 60 వసంతాలు ఉంటాయి. మార్చి 30 వ తేదీ పాడ్యమి తిథి నుంచి ఈ విశ్వావసు సంవత్సరం మొదలు కానుంది. ఆదివారంతో సంవత్సరం ప్రారంభమవుతున్నందున ఈ సంవత్సర అధిపతి సూర్యుడు. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరం తమకు అనుకూలంగా ఉందా.. ప్రతికూలంగా ఉందా.. ఆదాయం ఎంత.. ఖర్చులు ఎన్ని తదితర విషయాలను ముందస్తుగానే తెలుసుకునేందుకు పండుగ రోజు సాయంత్రం దేవాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

-వరంగల్ వాయిస్, వరంగల్

- సృష్టి ఆరంభానికి సంకేతంగా ఉగాది
- షడ్రుచుల సమ్మేళనం ఈ పండుగ ప్రత్యేకం
- ఈ సంవత్సర అధిపతి సూర్యుడు
- ప్రత్యేక ఆకర్షణగా పంచాంగ శ్రవణం
- ముస్తాబవుతున్న ఆలయాలు



వివరాలు2లో..


పాఠకులకు, ప్రకటన కర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు..
ఇట్లు : మేనేజ్‌మెంట్, వరంగల్ వాయిస్


## గ్రామాభివృద్ధికి మొదటి ప్రాధాన్యం

- సీఎస్ఆర్ నిధులతో పరుగులు పెడుతున్న పనులు
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో..



8లో..

## ఎంజీఎంను ప్రక్షాళన చేయండి..

- తక్షణమే సమస్యలు పరిష్కరించాలి
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- కలెక్టర్ సత్య శారదకు వినతి

## కాజీపేట స్థాయిని తగ్గించొద్దు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- మేయర్ గుండు సుధారాణితో కలిసి మీడియా సమావేశం



8లో..



# 'విశ్వావసు'కి స్వాగతం!

- సృష్టి ఆరంభానికి సంకేతంగా ఉగాది
- షడ్రుచుల సమ్మేళనం ఈ పండుగ ప్రత్యేకం
- ఈ సంవత్సర అధిపతి సూర్యుడు
- ప్రత్యేక ఆకర్షణగా పంచాంగ శ్రవణం
- ముస్తాబవుతున్న ఆలయాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ పండగల పరమార్థమే వేరు. కాలమానం ప్రకారం, ప్రకృతికి దగ్గరగా పండగల పరమార్థం ఉంటుంది. ఉగాది పండుగను ద్రావిడ భాషలు మాట్లాడే ప్రజలు మరాఠీ ప్రాంతానికి వ్యాప్తి చేశారు. అక్కడ ఈ పండుగ గుడిపడ్వాగా పేరొందింది. హిందువులకు అత్యంత శ్రేష్ఠమైన ఈ ఉగాదిని ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో విశేషంగా జరుపుకుంటారు. తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటకలో ఉగాదిగా పరిగణిస్తే మహారాష్ట్రలో 'గుడిపాడ్వా' పేరుతో పిలుస్తారు. తమిళులు 'పుత్తాండు', మలయాళీలు 'విషు', సిక్కులు 'వైశాఖీ', బెంగాలీలు 'పొయ్‌లా బైశాఖ్' గా జరుపుకుంటారు. అయితే పండుగను నిర్వహించడంలో పెద్దగా తేడాలు లేవనే చెప్పవచ్చును. ఉగాది రోజున పంచాంగ శ్రవణం జరుపుట ఆనవాయితీగా వస్తోంది. ఆ సంవత్సరంలోని మంచి చెడులను, కందాయ ఫలాలను, ఆదాయ ఫలాయాలను, స్థూలంగా తమ భావిజీవిత క్రమం తెలుసుకొని దాని కనుగుణమైన నిర్ణయాలు తీసుకోవటానికి ఇష్టత చూపుతారు. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగ అని చెప్పవచ్చు.

**పండుగ ప్రత్యేకం..**

తెలుగువారికి ఉగాది చాలా ప్రత్యేకమైన పండగ అని చెప్పవచ్చు. మనకు కొత్త వత్సరం ఉగాదితోనే ప్రారంభం అవుతుంది. బ్రహ్మదేవుడు ఇదే రోజున విశ్వాన్ని సృష్టించాడని పురాణోక్తి. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడు.. అంటే ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణ ఐతిహ్యం. వేదాలను హరించిన సోమకుని మత్స్యావతారి అయిన విష్ణువు వధించి తిరిగి వాటిని బ్రహ్మకు అప్పగించడం ద్వారా విష్ణువు ప్రీత్యర్థం 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందన్న పురాణ ప్రచారం కూడా ఉంది. ఏది ఏమైనా జడప్రాయమైన జగత్తులో చైతన్యాన్ని రగిలించి మానవాళిలో నూతనాశయాలను అంకురింప చేసే శుభదినం ఉగాది అని చెప్పవచ్చు. పండగ రోజంతా కొత్త వాతావరణం స్ఫురిస్తూ ఉంటుంది. నూతనశోభ సర్వత్రా వెల్లి విరుస్తుంది. ప్రకృతిలోని చెట్టు, పుట్ట అంతా ఆనంద మయంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. అలాంటి శుభవేళ మానవాళి అంతా ప్రకృతి పులకింతకు అనుగుణంగా మధురానుభూతులను పరస్పరం పంచుకోవాలన్న ఓ మహత్తర సమసమాజ స్థాపన లక్ష్యం ఉగాది పండగ వెనుక దాగి ఉంది.

**షడ్రుచుల పచ్చడి..**



ప్రాతః కాలమునే లేచి ఇళ్లు, వాకిళ్లు, శుభ్ర పరచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంక రిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, ఉగాది పచ్చడితో దినచర్య ప్రారంభిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకమైంది. ఇది షడ్రుచుల సమ్మేళనం. తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులు కలసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుంది. ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ ఆరోగ్య పరిరక్షణకు ఉపయుక్తమయ్యే దివ్య ఔషధాలే. అంటే కష్టం వచ్చినా, సుఖం వచ్చినా సమానంగా స్వీకరించాలనే చక్కటి సూచన చేస్తూ మన పెద్దలు ఈ పచ్చడిని ప్రసాదంగా స్వీకరించే అలవాటును పెట్టారు.



**సూర్యుడు అధిపతి..**

విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం నాడు ప్రారంభమవుతోంది. ఆదివారంతో సంవత్సరం ప్రారంభమవుతున్నందున ఈ సంవత్సర అధిపతి సూర్యుడు. సూర్యుడు మేషరాశిలోకి సంక్రమించే వారాన్ని బట్టి మంత్రిని, సింహరాశిలోకి ప్రవేశించే వారం ఆధారంగా సేనాధిపతిని, కర్కాటక సంక్రమణం చేసే వారాన్ని బట్టి సస్యాధిపతిని, ధనూరాశిలోకి వచ్చే వారం ఆధారంగా ధాన్యాధిపతిని, మిథున సంక్రమణ జరిగే వారాధిపతిని అర్ఘాధిపతిగా, తులలో ప్రవేశించే రోజును బట్టి రసాధిపతిని, మకరరాశిలో ప్రవేశించే వారం ఆధారంగా నీరసాధిపతిని.. ఇలా నవ నాయకులను నిర్ణయిస్తారు. సూర్యుడు.. ఆరుద్ర నక్షత్రంలోకి ప్రవేశించే వారం అధిపతి ఆధారంగా మేఘాధిపతిని నిర్ణయిస్తారు. నవనాయకులను బట్టి.. సంవత్సర ఫలితాలను పంచాగకర్తలు అంచనా వేస్తారు.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



**- మంత్రి కొండా సురేఖ**

రాష్ట్ర ప్రజానీకం, ఉమ్మడి వరంగల్ వాసులకు తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించేది మాత్రమే కాకుండా, నూతన ఆశలు, కొత్త లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే అద్భుతమైన శుభదినమని సురేఖ పేర్కొన్నారు. ఉగాది పచ్చడి మాదిరిగా జీవితం కూడా చేదు, తీపి, కారం, వగరు, పులుపు, ఉప్పు రుచులతో కూడి ఉంటుందని, సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ విజయపథంలో ముందుకు సాగాలని కోరారు.

**- వరంగల్ వాయిస్, హైదరాబాద్**

## ఆశలు, ఆశయాలు నెరవేరాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసే పండుగ ఉగాది అన్నారు. ఉగాది పచ్చడిలాగా ప్రతి ఒక్కరి జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరారు. ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపే శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రశాంతంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. సరికొత్త ఆశలు, నిండైన నవ్వులతో ఉగాదిని ఆహ్వానించాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలకు శుభం కలగాలని వారి ఆశలు, ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

**కలెక్టర్ ప్రావీణ్య శుభాకాంక్షలు..**



హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్య జిల్లా ప్రజలకు నూతన సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి పండుగలు ఉగాది పండుగతోనే మొదలవుతాయన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ జిల్లా ప్రజలందరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలని, ప్రజల జీవితాల్లో విజయాలు, సంపదలు, సంతృప్తి సమృద్ధిగా సమకూరాలని, యువత కొత్త ఆశయాలు, ఆలోచనలతో ముందుకు సాగాలని, జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.



## ప్రజలకు సేవ చేయాలి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మండి బజార్ లో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ క్లినిక్ ను శనివారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొండా మురళికి కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ పూల బొకే అందించి స్వాగతం పలికారు. పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్
- ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రం అందజేత



**వరంగల్ వాయిస్, సంగారెడ్డి:** ఎన్ హెచ్ఎం ఉద్యోగులపై అన్యాయం జరుగకుండా 510 జీవోను సవరించి, నష్టపోయిన నాలుగు వేల మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు, శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహాను మర్యాదపూర్వకంగా కలిసి, ఉద్యోగులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత, హెల్త్ కార్డ్, హెల్త్ ఇన్సూరెన్స్ లాంటి ప్రయోజనాలను ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. అలాగే, ఏడు నెలల పీఆర్‌సీ బకాయిలు విడుదల చేయడం, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించడం, తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులకు క్యాడర్‌కు తగిన వేతన సవరణ చేయడం అవసరమని చెప్పారు. ఇక, ఎం.ఎల్.హెచ్.పీల పేరును ఆయుష్మాన్ భారత్ మెడికల్ ఆఫీసర్‌గా మార్చాలని, ఉద్యోగులందరికీ సంవత్సరానికి 35 సాధారణ సెలవులు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఎన్ హెచ్ఎం ఉద్యోగి కుటుంబ సభ్యులకు 6 నెలల లోపు కారుణ్య నియామకం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జరిగినట్లుగా తెలంగాణలో కూడా ఎన్ హెచ్ఎం ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేయాలని మంత్రి దామోదర నర్సింహాను కోరారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ హెచ్ఎంలో 78 క్యాడర్లలో 17,541 మంది ఉద్యోగులు ఉన్నారని, 2018 సెప్టెంబర్ 5న విడుదలైన 510 జీవో ద్వారా కేవలం 8 క్యాడర్లకు మాత్రమే వేతనాలు పెంచడంతో మిగిలిన 70 క్యాడర్లలోని 4,000 మందికి అన్యాయం జరిగిందని అన్నారు. ఈ కారణంగా 510 జీవోను సవరించి, 4,000 మందికి వేతన సవరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే నాలుగు వేల కుటుంబాలకు న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 510 జీవోను సవరించే అంశంపై అధికారులతో ఫోన్ లో చర్చించారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి క్యాడర్‌కు వేతన సవరణ విధానం అమలు చేయాలని ఉద్యోగులకు తెలియజేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయడం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అయితే ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కొంత సమయం పడుతుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయుష్ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# చలి వేంద్రాన్ని ప్రారంభించిన సీఎండీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్కలగుట్ట సబ్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రారంభించారు. ఆయన ముందుగా రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యుత్ అధికారులు ప్రజల గృహాలలో వెలుగు ప్రసరింపజేయడం మాత్రమే కాకుండా, సామాజిక కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యమవడం అభినందనీయమని తెలిపారు. వేసవి కాలంలో పాదచారుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులను ప్రశంసించారు. అలాగే, ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 ఎన్జీవో సంస్థల ఆధ్వర్యంలో వసతి పొందుతున్న దాదాపు 3,000 మంది మానసిక వికలాంగులు, వృద్ధులు, అనాథలు, వితంతువులకు ప్రతి నెల సహాయం అందించడం విద్యుత్ ఉద్యోగుల ఉదారతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ఎల్లప్పుడూ సామాజిక కార్యక్రమాల్లో ముందుండి ప్రజలకు సేవ చేయడం గర్వించదగిన విషయమని తెలిపారు. ప్రతి ఏటా పవర్ డిప్లొమా ఇంజనీర్స్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో సేవ చేయాలనే తపన కలిగి ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర పురోగతికి ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూదన్, సీజీఎంలు రవీంద్రనాథ్, వెంకటరమణ, జీఎం వేణుబాబు, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్, తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.సీ. రెడ్డి, ఎన్పీడీసీఎల్ సెక్రటరీ జనరల్ నార్ల సుబ్రమణేశ్వర్ రావు, అసోసియేషన్ అడ్వైజర్ జె.మధుసూదన్, అధ్యక్షుడు ఎం. ఇంద్రసేనా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. నరేందర్, ఎన్పీడీసీఎల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.మల్లికార్జున్, హనుమకొండ సర్కిల్ సెక్రటరీ యం.అనిల్ కుమార్, ఇతర అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఉద్యోగిగా విధుల్లో చేరినప్పటి నుంచి అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరిగా వస్తుందని జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఆకుతోట ఇందిరా పేర్కొన్నారు. ములుగు జిల్లా, ఏటురునాగారం ప్రభుత్వ గిరిజన ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన వల్లాల సదానందంను చిల్డ్రన్ పార్క్ యోగా సాధకుల బృందం ఘనంగా సన్మానించింది. శాలువాతో సత్కరించి, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమకొండలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఆకుతోట ఇందిరా మాట్లాడుతూ, సదానందం చేసిన సేవలను కొనియాడారు. గిరిజన శాఖలో ఆయన క్రమశిక్షణతో, స్నేహపూర్వకంగా పనిచేసి అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమని, ఇది ప్రతి ఉద్యోగికి అనివార్యమని తెలిపారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతిరోజు యోగా చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, గత రెండేళ్లుగా సదానందం దంపతులు చిల్డ్రన్ పార్క్ యోగా శిక్షణ తరగతులకు హాజరవుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. యోగా ద్వారా జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు మానసిక సమస్యలు నివారించుకోవచ్చని తెలిపారు. సదానందం తన ఇంజనీరింగ్ విభాగంలో అంకితభావంతో సేవలందించారని, ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు యోగా అనుసరించడం మేలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ బత్తుల రాజేందర్, వెంకటేశ్వర్లు, లకావత్ చిరంజీవి, శాంతి, రాజేశ్వరి, మంజుల, కళావతి, కళా, నయన, సురేష్, శివ శంకర్, వెంకట్ చారీ, రవీందర్, గణేష్, సాయిలు తదితర యోగా సాధకులు పాల్గొన్నారు.

# పోస్టల్ ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** శ్రీ రాజరాజేశ్వరి సేవా సంఘం ఆటో యూనియన్, న్యూ శాయంపేట సభ్యులకు గత రెండు రోజులుగా పోస్టల్ ప్రమాద బీమా అందజేయబడుతోంది. ఈ యూనియన్‌లో 180 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ కేవలం రూ.755 చెల్లించి రూ.15 లక్షల ప్రమాద బీమా అందించబడుతోంది. ఈ బీమా ద్వారా పాలిసీదారునికి ప్రమాదవశాత్తు మరణం సంభవించిన సందర్భంలో కుటుంబ సభ్యులకు రూ.15 లక్షలు అందించబడతాయి. అలాగే, శాశ్వత వైకల్యం కలిగినప్పటికీ మొత్తం రూ.15 లక్షల పరిహారం లభిస్తుంది. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాల్సి వస్తే, చికిత్స ఖర్చుల కోసం రూ.1 లక్ష వరకు అందించబడుతుంది. అదనంగా, ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లల విద్య లేదా వివాహానికి అదనంగా రూ.1 లక్ష మంజూరు చేయబడుతుంది. ఈ కార్యక్రమాన్ని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ దనుగూరి ప్రమోద్ సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఇన్సూరెన్స్ ప్రక్రియను ఐపీపీబీ ఉడాన్ ఎగ్జిక్యూటివ్ లింగమూర్తి ఆన్ లైన్ విధానంలో పూర్తి చేసి, వెంటనే పాలిసీ బాండ్ అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వరి సేవా సంఘం అధ్యక్షులు వేల్పుల సాంబమూర్తి, వైస్ ప్రెసిడెంట్ సునీల్, కోశాధికారి రాసమల్ల సురేష్, గౌరవాధ్యక్షులు గుండు సత్యం, చాడబోయిన జనార్ధన్, వేల్పుల పున్నం చందర్, ఆవునూరు లక్ష్మణ పాల్గొని విజయవంతం చేశారు.

# భీంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉగాది వేడుకలు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని భీంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉగాది పండుగను ఎంతో వైభవంగా జరిపారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో ఉత్సాహంగా ఈ వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటికొండ వీరస్వామి ఉగాది పండుగ ప్రాముఖ్యతను వివరించి, ఉగాది పచ్చడి ప్రత్యేకతను తెలియజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉగాది పచ్చడి, పులిహోర, భక్షాలు పంపిణీ చేశారు. అలాగే, ఇటీవల గ్రామంలో ప్రారంభించిన 'బడిబాట' కార్యక్రమంలో తల్లిదండ్రుల సహకారం ఎంతో మద్దతుగా నిలిచిందని ప్రశంసించారు. పిల్లలకు సాంప్రదాయాలు, ఆచారాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ త్రివేణి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, జ్యోత్స్న, సుజాత, అంగన్వాడీ టీచర్లు వరలక్ష్మి, సులోచన, ప్రీ-ప్రైమరీ టీచర్ పూజిత, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నవోదయ ప్రవేశ పరీక్షలో శ్రేయస్ ప్రతిభ



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన బొట్ల శ్రేయస్ (బిట్టు) జవహర్ నవోదయ విద్యాలయ సమితి టెస్టు (జేఎన్ వీఎస్టీ)-2025లో తన ప్రతిభను నిరూపించుకుని 6వ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు. బొట్ల సురేష్, సుజిత దంపతుల చిన్న కుమారుడైన శ్రేయస్ ప్రస్తుతం భూపాలపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ప్రతిష్టాత్మక నవోదయ విద్యాలయానికి ఎంపికైన శ్రేయస్‌ను పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

# మండల కోఆర్డినేటర్ మీటింగ్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని 20వ డివిజన్‌లో, కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో "జై బాబు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ ఆదేశాల ప్రకారం విజయవంతంగా నిర్వహించేందుకు మండలాల వారీగా కోఆర్డినేటర్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, కార్పొరేటర్ బసవరాజ్ శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేష్, నేతలు తోట బాలరాజు, గోరంటల రాజు, ఇతర కాంగ్రెస్ కార్యకర్తలు హాజరయ్యారు.

# బస్సు ఢీకొని మహిళ మృతి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. రేగొండ మండలం కనిపర్తి గ్రామానికి చెందిన జయలక్ష్మి (55) పసరుగొండ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో పసరుగొండ క్రాస్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న సమయంలో హనుమకొండ నుంచి పరకాల వైపుగా వెళ్తున్న టీఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ ముక్కెర కుమారస్వామి అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపించి ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జయలక్ష్మి తీవ్రంగా గాయపడగా, అక్కడి ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ఆమెను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు నేరెళ్ల శంకర్ ఫిర్యాదు మేరకు దామెర ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, గణపురం :** తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, పార్టీ జెండా ఆవిష్కరించి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు ఆర్పి గణేష్ మాట్లాడుతూ, "సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు" అనే నినాదంతో ఎన్టీఆర్ 1982 మార్చి 29న హైదరాబాదులో తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. చైతన్య రథంపై సుడిగాలి పర్యటన చేసి, కేవలం తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అమలు చేసిన సంస్కరణల వల్ల తెలంగాణలో స్వేచ్ఛ, స్వతంత్రత ప్రబలిందని, పటేల్–పట్వారి వ్యవస్థ నిర్మూలన జరిగిందని వివరించారు. బడుగు, బలహీన వర్గాలకు స్వేచ్ఛను కల్పించి, మండలిక వ్యవస్థ ద్వారా ప్రజల దాకా పాలనను తీసుకువచ్చారని అన్నారు. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేయడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. మహిళా సాధికారత కోసం మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం, రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రోత్సాహించడం, డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ చేపట్టిందని పేర్కొన్నారు. పేద ప్రజలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందించడంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ముందుండిందని గణేష్ తెలిపారు.

# ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలేవి..?

## ■ రోగులకు అందని ఉచిత మందులు
## ■ కమలాపూర్ సీహెచ్ సీలో దయనీయ పరిస్థితి



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరిపడా వైద్యుల లేమితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆరోగ్య మంత్రిగా ఈటల రాజేందర్ బాధ్యతలు చేపట్టిన సమయంలో మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో 2017లో 30 పడకల ఆసుపత్రి భవనం నిర్మించినా, ప్రస్తుతం ఆసుపత్రి పరిస్థితి ఆశాజనకంగా లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా పేరున్న ఈ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన ఉచిత మందులు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ల్యాబ్, ఫార్మసీ సేవల్లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రికి అందిస్తున్న ఉచిత మందులు నిజంగా రోగులకు చేరుతున్నాయా? లేక అవి మరెక్కడికైనా మళ్లించబడుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇక్కడ పనిచేస్తున్న ఓ ప్రముఖ వైద్యుడు రోగులను తనకు సంబంధమున్న ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే అంశంగా నిలుస్తోంది. ఈ సమస్యల గురించి పలుమార్లు కలెక్టర్, డీఎంహెచ్ఓ తదితర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆసుపత్రిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తగిన చర్యలు తీసుకుని కమలాపూర్ ఆసుపత్రి సీహెచ్ సీ స్థాయిలో పనిచేసే విధంగా చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# బీజేపీ బూత్ కార్యక్రమం వీక్షించండి



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల బీజేపీ కార్యకర్తలు, నాయకులు రేపు నిర్వహించనున్న బూత్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో అందరూ వీక్షించాలనిలా చూడాలని బీజేపీ గణపురం మండల శాఖ విజ్ఞప్తి చేసింది. రేపు ఉద్యం 11గంటలకు అన్ని డిడి ఛానెల్స్ లో ప్రసారమ్యే కార్యక్రమాన్ని బూత్ అధ్యక్షులు, కన్వీనర్లు, సహ–కన్వీనర్లు తమ తమ బూత్ పరిధిలో చూడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, కార్యక్రమం వీక్షించిన ఫొటోలను "సరల్" యాప్‌లో అప్లోడ్ చేయాలని బీజేవైఎం జిల్లా నేత మంద మహేష్ తెలిపారు.

# పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ నగరంలోని కిల వరంగల్ ఈద్గాలో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా కిరాణా సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ ఉబేద్ బాబా, నగర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నందిరాం నాయక్, మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం పాల్గొన్నారు. తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్‌ను అభినందించడంతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. అదనంగా, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, స్వామి గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ చాంద్ పాషా, కమిటీ సభ్యులు ఎండీ మగ్దూం, మీర్జా హసన్ బేగ్, దస్తగీర్, గఫార్, ఇంతియాజ్ ఖాన్, సాదిక్, సలీం, సర్వర్, వహీద్, ఆజం, అఫ్జల్, ఫహీమ్ అహ్మద్, ఎండీ యాజం, ఎండీ కాజా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతినెల గ్రామదేవతలకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా గ్రామ దేవతలకు పంచామృతాలతో అభిషేకం పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు నిర్వహించారు.

# మిల్లు కార్మికులకు మిల్లు భూముల్లో స్థలాలు ఇవ్వాలి

## కార్మిక పక్ష నాయకుడు గుత్తికొండ రవి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని మిల్లు కార్మికులకు గతంలో మిల్లు భూములు ఇచ్చిన విధంగా 318 మంది కార్మికులకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు అనుసరించి కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కార్మిక పక్ష నాయకుడు గుత్తికొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో134 కార్మికులకు మిల్లులో పనిచేసిన కార్మికులకు స్థలాలు ఇచ్చిన విధంగా ఇవ్వాలని గుత్తికొండ రవి తెలిపారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా పరకాలను అభివృద్ధి చేస్తా

## ▪ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. శనివారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను టాస్క్ (TASK) అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. కళాశాల ప్రాంగణాన్ని సుందరీకరించి, విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేవలం ఉన్నత సాంకేతిక విద్య అందించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు పెంపొందేలా ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు. అలాగే, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేయాలని, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పరకాల పట్టణానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనదని, అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, ప్లేస్ మెంట్స్ అండ్ ట్రైనింగ్ హెడ్ ప్రదీప్ రెడ్డి, రీజినల్ సెంటర్ హెడ్ సవీన్ రెడ్డి, హనుమకొండ ఇండస్ట్రీస్ జీఎం నవీన్, ఆర్డీవో నారాయణ, ఇతర అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలి

## ఎంఈఓ హనుమంతరావు



**వరంగల్ వాయిస్, నడికూడ:** విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ప్రాథమిక స్థాయి నుంచే ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు నడికూడ మండల విద్యాశాఖ అధికారి కె. హనుమంతరావు తెలిపారు. శుక్రవారం నడికూడ మండలం వరికోలు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శరత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరత్ గౌడ్ పాఠశాల వార్షిక నివేదికను సమర్పించిన అనంతరం, మండల విద్యాశాఖ అధికారి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాత్మక అభివృద్ధి కొనసాగించడంతో పాటు, విద్యార్థులకు అధునాతన బోధన అందించేందుకు ప్రభుత్వం పీఎం శ్రీ పథకం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని ఆయన వివరించారు. విద్యార్థుల బోధనలో భాగంగా క్షేత్ర సందర్శనలు, ప్రత్యక్ష అనుభవపూర్వక శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి సృజనాత్మకతను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించడంతో పాటు, విద్యార్థులకు ఆటలు, పాటలు, నృత్యాలు, క్రీడలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపితే, రూపాయి ఖర్చు లేకుండా ఉత్తమ బోధన అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శరత్ గౌడ్‌ను అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వరికోలు ఉన్నత పాఠశాల పీజీ హెచ్.ఎం. జి.విజయలక్ష్మి, పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పోచంపల్లి కవిత, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వడ్డేపల్లి ట్యాంక్ బండ్ పై ఉచిత మెడికల్ క్యాంప్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పట్టణంలోని వడ్డేపల్లి పరిధిలో ఉన్న ట్యాంక్ బండ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ కేర్ హోమియోపతి సిబ్బంది ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యులు అక్కడికి వచ్చిన వారికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించడంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధుల గురించి అవగాహన కల్పించి అవసరమైన సూచనలు అందించారు. క్యాంప్ ముగింపు సందర్భంగా వాకర్స్ సంఘం సభ్యులు డాక్టర్.కేర్ సంస్థ ఎండీ డా.ఏ.ఎం.రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు బొల్లపెల్లి రాజేశ్వర్, శ్రీనివాస్, సంజీవ రెడ్డి, వైద్యులు డాక్టర్. నిఖిల్ తేజ, డా. ప్రీతి, పీఆర్ఓ శంకర్ సింగ్, పవన్, పూజ, హరిణి పాల్గొన్నారు.

# లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఉగాది సంబరాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శనివారం ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 5నుండి 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉగాది పచ్చడి, భక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శేర్ల. అనిల్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు కుల మతాలకు అతీతంగా ప్రతి పండుగ విశిష్టతను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియచేశారు. ఉగాది తెలుగు సంవత్సరాదిని సూచిస్తుంది. మనం చాంద్రమానాన్ని ఎప్పుడూ కూడా కాలగమనానికి ప్రాతిపదికగా తీసుకుంటాం. ఈ చంద్రమానం నందు చైత్రమాసం మొట్టమొదటి మాసంగా స్వీకరించబడుతుంది. ఈ చైత్రమాసంలో వచ్చేటువంటి శుక్లపక్ష పాడ్యమి ఏదైతే ఉందో ఆ పాడ్యమి మొదటి తిథి. ఆ మొదటి తిది ఏ ఉగాది పండుగ.ఈ ఉగాది పండుగ నాడు బ్రహ్మ ముహూర్తానికి ముందు నిద్రలేచి స్నానమాచరించాలి. పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు చైత్ర శుద్ధ పాడ్యమి రోజున విశ్వాన్ని సృష్టించాడు అని మన పురాణాల్లో ఉందన్నారు. తెలుగువారు అందరికీ ఈ ఉగాది గొప్ప పండుగని పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేర్ల. రజిని, ఉపాధ్యాయులు కృష్ణవేణి, సాలేహా, పూర్ణిమ, మానస, సాయి కృష్ణ, తస్లీమా, ప్రవీణ్, ఫర్హత్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



**➲ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శనివారం 10వ డివిజన్‌లోని మచిలీ బజార్, నబీ ఖాన్ వద్ద రూ.75 లక్షలతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజ్ పనులకు ఆయన కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని 10వ డివిజన్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులను అమలు చేయనున్నట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దశల వారీగా అన్ని వార్డుల్లో సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్నాయని, ఈ పనులకు కాలనీ వాసులు పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. కాలనీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రేటర్ వరంగల్‌కు మరిన్ని నిధులు సమకూర్చి, పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం మత్స్య శాఖ సొసైటీ హనుమకొండ అధ్యక్షుడు కత్తెర సారంగపాణి నేతృత్వంలో ఎమ్మెల్యేకు మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు శోభన బోయిన కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నజీమ్ జిహాన్, నజీర్ బాయ్, గంగు ఉపేంద్ర శర్మ, అంబటి మహేందర్, పల్లం రమేష్, మాడిశెట్టి సతీష్, బొంత రాఘవులు, జాఫర్ ఖాన్, షేక్ యాకూబ్, సంపతి కృష్ణ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# ఏకశిలలో ముందస్తు ఉగాది వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** దామెరలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో ఉగాది వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి మాట్లాడుతూ, ఉగాది పండుగను తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా నిర్వహిస్తారని, ఈ సందర్భంగా పండితులు కొత్త సంవత్సర ఫలాలను వివరిస్తారని అన్నారు. అలాగే, షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి రూపొందించడం ద్వారా జీవితం సుఖదుఖాలతో ముడిపడి ఉన్నదనే సందేశాన్ని అందిస్తారని వివరించారు. విద్యార్థులు కొత్త ఆశయాలతో, లక్ష్యాలతో ముందడుగు వేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాన్ని సాంప్రదాయబద్ధంగా మామిడి తోరణాలతో అందంగా అలంకరించి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల్ని అభినందించిన డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అరవింద పబ్లిక్ స్కూల్‌లో ..



**వరంగల్ వాయిస్, ఖిలావరంగల్ :** వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య కేక్ కట్ చేసి ఉగాది వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడి అందించి శ్రీ విశ్వావసు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నర్సయ్య మాట్లాడుతూ.. యుగ అంటే యుగం, ఆది అంటే ప్రారంభం అంటే కొత్త యుగం ప్రారంభం అని అర్థం. చైత్రమాసం శుక్లపక్షం పాడ్యమి రోజున ఆ విధాత ఈ జగత్తును సృష్టించాడని నమ్ముతారు. అంటే కాల గణాన్ని, గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్షాధికులను బ్రహ్మదేవుడు సృష్టించాడని నమ్మకం. అంతేకాకుండా వసంత రుతువు కూడా ఈ రోజు నుండే ప్రారంభమవుతుంది. అందుకే నూతన జీవితానికి నాందిగా ఉగాది పండుగను జరుపుకుంటారన్నారు. మన తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల గురించి బాల్యం నుంచే తెలియ చేయాలనే ఉద్దేశంతో శనివారం పాఠశాలలో ఉగాది వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన ఆకుల కేశవ్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా, బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు వారి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల బీజేపీ అధ్యక్షుడు ఎరుకల దివాకర్, కంఠాత్మకూర్ మాజీ సర్పంచ్ శివకుమార్, అలాగే సల్పుల సురేష్, సుధీర్, కుమారస్వామి తదితర స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, మార్చి 29, 2025

# గిరిజన చరిత్రలో రేవంత్‌కు ప్రత్యేక స్థానం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** బంజారా భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రలో నిలిచిపోతుందని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం గిరిజన తెగల కోసం గొప్ప ముందడుగని అభిప్రాయపడ్డ వారు, ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు జరిపాయి. డోర్నకల్ మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్ర నాయక్, మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో గిరిజన తెగలు దాదాపు 12 కోట్లు ఉన్నారని, బంజారా (లంబాడీ) భాష, సంస్కృతి గోర్బోలి భాషతో ముడిపడి ఉన్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన అసెంబ్లీ తీర్మానాన్ని పార్లమెంట్‌లో బిల్లు రూపంలో ఆమోదించి, దేశంలోని 23వ అధికారిక భాషగా గుర్తించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కాసం శేఖర్, ఆంగోత్ వెంకన్న, రాయల వెంకటబాబు, హనుమ, మోహన్ నాయక్, ఖాదర్ బాబా, ఫరీద్, ప్రవీణ్, భాస్కర్, నాని, డిజె శ్రీనివాస్, లెనిన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 59 డివిజన్ భవాని నగర్ కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం కాలనీలోని రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, డ్రైనేజ్ కాలువల పరిశుభ్రత గురించి కాలనీ వాసులకు స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రాజా రెడ్డి, కాలనీ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు ప్రకాష్ రావు, శానిటరీ ఇన్ స్పెక్టర్ సంపత్ రెడ్డి, జవాన్ భిక్షపతి, కమిటీ సభ్యులు ప్రేమాకర్ రెడ్డి, చాడ శ్రీనివాస్ రెడ్డి,జితేందర్,భాస్కర్, జనార్దన్ రావు,రామ్ రెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ ప్రజలందరికీ పంచాయతీ కార్యదర్శుల ఫోరం హనుమకొండ జిల్లా కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసే పండుగ ఉగాది అన్నారు. ఉగాది పచ్చడిలాగా ప్రతి ఒక్కరి జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరారు. ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపే శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో దామెర మండలం కొగిల్వాయి గ్రామ శివారులో శనివారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ పోలీసులను చూసి పారిపోతుండగా వెంటనే అతడిని పట్టుకొని విచారించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన యార రవికుమార్ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లుగా ఒప్పుకున్నాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, ఇసుక ట్రాక్టర్ తో పాటు రవికుమార్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎస్సై శ్రీ కొంక అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, నగికూడ:** మండలంలోని చౌటుపర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారంపాఠశాల వార్షికోత్సవం, స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడెం రాజేందర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నడికూడ మండల విద్యాశాఖ అధికారి కె.హనుమంతరావు, పీఆర్ టీయూ టీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె. హనుమంతరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ఇందులో పని చేసే ఉపాధ్యాయులు అనేక పోటీ పరీక్షలను ఎదుర్కొని నియామకం పొందిన వారని పేర్కొన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విలువలతో కూడిన బోధనను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. కాబట్టి, రాబోయే విద్యా సంవత్సరంలో గ్రామంలోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామ ప్రజలను కోరారు. పీఆర్టీయూ టీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాసులు, ఐఎఫ్ పీ బోర్డు ద్వారా ఆంగ్ల మాధ్యమంలో బోధన అందుతున్నట్టు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి కృషి చేయాలని సూచించారు. స్వయం పరిపాలన దినోత్సవం, వార్షికోత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ప్రేక్షకులను అలరించారు. విద్యార్థుల ప్రతిభను గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గూడెం రమ్య, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.సదానందం, ఎం.రామయ్య, ఎన్.జగదీష్, జి.నాగరాజు, టి.జయప్రకాష్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు జి.శ్రీలత, ఎల్.జయ, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్లన్న ఎన్టీఆర్



➲ టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** “సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్లు” అనే మహానినాదంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఆయన తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడని టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య (చంద్రబాబు) పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన, ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. 1982, మార్చి 29న తెలుగుదేశం పార్టీ పుట్టి, ఎంతో వేగంగా అభివృద్ధి చెంది, పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఏకైక పార్టీగా ఎదిగిందని ఆయన అన్నారు. ఎన్టీఆర్ ప్రతిక్షణం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఆ పార్టీని ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని ఆయన అన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల మల్లేష్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహ్మద్ జహంగీర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఉమ్మగొని నరసయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొంగరి నర్సింగరావు, సీనియర్ నాయకులు కొమురం జి, తానాజీ, ఈర్య నాయక్, నకీర్త సత్తయ్య, నాకీర్త వెంకటేష్, పోన్నాల శ్రీనివాస్, పొన్నాల బక్కయ్య, పొన్నాల వెంకటరమణ, ఇమ్మడిశెట్టి నాగేష్, కాదునూరి మధుసూదన్, సముద్రాల యాదగిరి, గండికోట యాదగిరి, శ్రీశైలం, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస్ పథకానికి అందరూ అర్హులే



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ సూచించారు. 2025 ఏప్రిల్ 5వ తేదీ వరకు సంబంధిత గ్రామాల్లోని మీసేవ కేంద్రాలలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, తాము కోరుకున్న పథకాన్ని ఎంచుకొని అప్లికేషన్ సమర్పించాలన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో అనేక అవకాశాలు ఉండగా, పథకం ఆధారంగా 60 శాతం నుంచి 100 శాతం వరకు సబ్సిడీ వర్తిస్తుందని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. అన్ని కులాల వారికి సబ్సిడీ అందుబాటులో ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నాలుగు గ్యారంటీలను ఎలా నెరవేర్చిందో, ఇదే విధంగా ఈ పథకాన్ని కూడా అమలు చేస్తున్నదని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఈ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చదువుకున్న యువతను, ఈ ప్రాంత ప్రజలను పట్టించుకోలేదని, ప్రజలను మోసం చేసిన ఘనత వారిదేనని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించడమే తమ లక్ష్యమని, ఈ బాధ్యతను కాంగ్రెస్ నాయకులు చేపట్టారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు దేవస్థాన డైరెక్టర్ దారం పూర్ణచందర్, మాజీ ఉప సర్పంచ్ రంగు జనార్ధన్, యూత్ నాయకులు కొమ్ము రమేష్, సాయి కృష్ణ, మహిళా మైనార్టీ నాయకురాలు సుల్తానా, ఎస్సీ సెల్ మండల నాయకులు బోట్ల కనకరాజు, బోట్ల వెంకన్న, బూత్ కన్వీనర్ పోకల శంకర్, దౌలత్ నగర్ అధ్యక్షుడు కత్తుల వెంకన్న, సీనియర్ నాయకులు ఐలయ్య, సుధాకర్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఏప్రిల్ 5న భారతదేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్, 14న భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అంకేశ్వరపు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా అంకేశ్వరపు రాంచందర్ రావు, వైస్ చైర్మన్‌లుగా బండారి సురేందర్, చుంచు రాజేందర్, గద్దల సుకుమార్, డైరెక్టర్లుగా జువ్వాడి కిషన్, ఎర్ర చంద్రమౌళి, కునమళ్ళ అనిత, చిలువేరు సంపత్, బొర్ర సంపూర్ణ నియమితులయ్యారు. ఈ సమావేశంలో ఎంఎస్పి జాతీయ నేత, జిల్లా ఇంచార్జి మంద కుమార్ మాదిగ, ఎంఆర్పిఎస్ జాతీయ నాయకులు పుట్ట రవి, బొట్ల బిక్షపతి, దళిత సంఘం సీనియర్ నాయకులు రడపాక పరంజ్యోతి, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగారపు రవి ప్రసాద్, టీజీవీపీ రాష్ట్ర నాయకులు మేడ రంజిత్ కుమార్, బొక్కల వెంకటస్వామి, ఎమ్మార్పిఎస్ (టి) తదితరులు పాల్గొన్నారు.




సౌమ్యుడిగానే కాక, విధి నిర్వహణలో అంకితభావం ఆయన సొంతం. వివిధ హోదాల్లో ఏడు జిల్లాలో పని చేసిన ఆయనకు ఓ ప్రత్యేకత ఉంది. క్రమశిక్షణ, పట్టుదలే ఆయన బలాలు. అవే అజాత శత్రువుగా మార్చాయి. ఆయనే ప్రకాశం జిల్లా (ఒంగోలు) ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (పీఎఫ్ ఆఫీస్)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ గా సేవలందిస్తున్న ముంద్రాతి సమ్మయ్య. ఎల్డీసీ స్థాయి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ దాకా ఎదిగిన ఆయన యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. పీఎఫ్ సంస్థ ద్వారా కొవిడ్ సమయంలో వేలాది మందికి లబ్ధి చేకూర్చి వారి ప్రశంసలు పొందారు. సాధారణ వ్యక్తిగా జీవితాన్ని కొనసాగించే ఆయన సంతృప్తే.. నా ఆరోగ్య విజయ రహస్యం అంటారు.' నా పరిధిలో నేను ఎంతమందికి సాయపడగలను. ఇదొక్కటే నేను అప్పుడు, ఇప్పుడు ఆలోచించేది .' అని చెబుతున్న **ముంద్రాతి సమ్మయ్య** ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు.






# అజాత శత్రువు..
# ముంద్రాతి సమ్మయ్య

- ఎల్‌డీసీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ దాకా సేవలు
- ఉద్యోగుల భవిష్యనిధి (పీఎఫ్) శాఖలో రాణింపు
- సేవా గుణానికి ప్రతిరూపం..
- సేవే పరమావధి.. నిజాయితీకి నిలువుటద్దం..








## క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు..

1965 మార్చి 2న హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామంలో ముంద్రాతి శాంతమ్మ–గోపాల్ దంపతులకు సమ్మయ్య జన్మించారు. ఈయనకు అన్నా, తమ్ముడు, నలుగురు అక్క చెల్లెలు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో సమ్మయ్య చిన్నతనంలోనే వ్యవసాయం కూలీ పనులు చేశారు. తండ్రి గోపాల్ 2001లో కన్నుమూశారు. తల్లి శాంతమ్మ 90 సంవత్సరాల వయసులో చిన్న కూతురు స్వరూప వద్ద నివసిస్తున్నది. కుటుంబ భారం చూసుకుంటూనే ఆయన కన్నా ముందు తమ్ముడి వివాహం జరిపించారు. 1992 జూన్ 2న వరంగల్ కు చెందిన కూచన భారతి–సత్యనారాయణ కూతురు మాధవిని వివాహం చేసుకున్నారు. వీరి కుమారుడు వంశీ, కుమార్తె ప్రవీణ ఇద్దరు కూడా బీటెక్ పూర్తి చేసి ఆస్ట్రేలియాలో సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తున్నారు. వీరి వివాహాలను ఘనంగా జరిపించారు. సమ్మయ్య సతీమణి ఉన్నత విద్యావంతురాలైన మాధవి 2002లో తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో లెక్చరర్ గా నియమితులయ్యారు. ఆమె అక్కడే పీహెచ్ డీ పూర్తి చేసి ప్రస్తుతం ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. మొదటి నుంచి టీచింగ్ ప్రొఫెషన్ లో ఉండాలని కలలు కన్న సమ్మయ్య కోరికను ఆమె తీరుస్తున్నది.

## విద్యాభ్యాసం..

ముంద్రాతి సమ్మయ్య ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్వగ్రామమైన పులుకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. తరువాత ఐటీఐ చేసి షార్ట్ హ్యాండ్, టైప్ రైటింగ్ లో లోయర్ గ్రేడ్ చేశారు. అనంతరం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేశారు. విద్యార్థి దశలో వరంగల్ గోపాలస్వామి గుడి దగ్గర టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో 50 రూపాయల వేతనంతో పనిచేస్తూ ఇంగ్లీష్, తెలుగు టైప్ హయ్యర్ గ్రేడ్ పాస్ అయ్యారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే ఎల్ఎల్ బీ, ., పీజీడీసీఏ, ఎంఏ, ఎంబీఏ., పీహెచ్ డీ (లా)తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన లెక్చరర్ షిప్ టెస్ట్ పాస్ అయ్యారు. ఎల్ఎల్ఎంలో గోల్డ్ మెడల్ సాధించారు. న్యాయ విద్యార్థుల కోసం ఇంగ్లీష్ లో ఒక హ్యాండ్ బుక్ ను రచించారు. ఏ పోటీ పరీక్ష రాసినా ఉత్తమ ర్యాంకులు సాధించిన సమ్మయ్యను పలు రకాల ప్రభుత్వ ఉద్యోగాలు వరించినా చివరికి ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్) సంస్థలో చేరారు.



## ఉద్యోగ ప్రస్థానం..

శాంత స్వభావి ముంద్రాతి సమ్మయ్య ఉన్నత చదువులు పూర్తికాగానే ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. 1987 మార్చి నుంచి 1989 మార్చి వరకు వరంగల్ జిల్లా కోర్టులో క్లర్క్ కం టైపిస్టుగా సేవలందించారు. ఆ తర్వాత ఆ ఉద్యోగం వదిలేసి 1989 మార్చి 10న ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్) వరంగల్ లో ఎల్ డీసీగా బాధ్యతలు చేపట్టి దశాబ్ద కాలం పని చేశారు. అక్కడే యూడీసీగా, సెక్షన్ సూపర్ వైజర్ గా పదోన్నతులు పొందారు. 2009 సెప్టెంబర్ 23 నుంచి 2010 సెప్టెంబర్ 29 వరకు నిజామాబాద్ పీఎఫ్ ఆఫీసులో సెక్షన్ సూపర్వైజర్ గా సేవలందించారు. 2010 సెప్టెంబర్ 30 నుంచి 2011 సెప్టెంబర్ 6 వరకు నిజామాబాద్ లో అకౌంట్ ఆఫీసర్ గా, 2011 సెప్టెంబర్ 7 నుంచి 2012 మే 6 వరకు కరీంనగర్ లో అకౌంట్స్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. 2012 మే 7 నుంచి 2016 మే 9 వరకు తిరుపతి పీఎఫ్ కార్యాలయంలో ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ గా, 2016 మే 10 నుంచి 2017 నవంబర్ 23 వరకు కడపలో అకౌంట్స్ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. 2017 డిసెంబర్ 7 నుంచి 2022 నవంబర్ 25 వరకు కడప ప్రాంతీయ కార్యాలయంలో ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ గా సమర్థవంతంగా సేవలందించారు. 2022 డిసెంబర్ 6 నుంచి 2025 మార్చి 31 వరకు ప్రకాశం జిల్లా పీఎఫ్ ఆఫీసులో ఎన్ ఫోర్స్ మెంట్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ముంద్రాతి సమ్మయ్య 31–3–2025 న ఉద్యోగ విరమణ చేశారు.

## సేవే పరమావధి..

ఏ జిల్లాలో పనిచేసినా ముంద్రాతి సమ్మయ్య సేవే పరమావధిగా చేశారు. పనికే మొదటి ప్రాధాన్యత నిచ్చిన ఆయన ఉద్యోగ ప్రస్థానంలో నో అని చెప్పే అలవాటు ఆయనకు లేదు. తన వల్ల ఎదుటివారికి లాభం జరుగుతుందంటే ఆ పనిని తప్పకుండా పూర్తి చేసే మనస్తత్వం ఆయనది. జిల్లా కోర్టులు, స్టేట్, జిల్లా కన్జ్యూమర్స్ ఫోరమ్స్, లేబర్ కోర్టులు, హైకోర్టులు, సీజీఐటీ, ఈపీఎఫ్ఏ ట్రిబ్యునల్స్ లోని కేసుల పరిష్కారానికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పక్షాన హాజరై తనదైన ముద్ర వేశారు.

2023 జనవరి 27న ప్రకాశం జిల్లాలో ' నిధి ఆప్కే నిఖత్ ,' పీఎఫ్ నియర్ యూ అనే ప్రోగ్రాంను తొలిసారిగా చేపట్టి సంస్థ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రకాశం జిల్లా నోడల్ ఆఫీసర్‌గా ఆయన కార్మికులకు సంబంధించిన విషయాలను, ఈపిఎఫ్ఓ తీసుకొచ్చిన కొత్త కార్యక్రమాలను తెలియ పరిచారు. 2024, 2025లో కూడా ఈ ప్రోగ్రాంకు సంబంధించిన వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ చేపట్టిన కొత్త మార్పులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, యాజమాన్యాలు, పెన్షనర్లకు పీఎఫ్ గురించి వివరించి అందరి మనసులో చెరగని ముద్ర వేశారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, తిరుపతి, కడప, ప్రకాశం జిల్లాలో పనిచేసినప్పుడు పీఎఫ్, పెన్షన్ కేసులను వారం రోజుల్లో పరిష్కరించి శభాష్ అనిపించుకున్నారు. ముఖ్యంగా కొవిడ్ సమయంలో పీఎఫ్ అడ్వాన్స్ పెట్టుకున్న కార్మికులకు ఒక్కరోజులోనే ప్రాసెస్ పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందారు. అయితే, తెలంగాణ జిల్లాలో సమ్మయ్య, ఆంధ్రాలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో మాధవి పనిచేయడం వల్ల భార్యాభర్తలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. రెండు వారాల పాటు కూడా తమ పిల్లలను కలుసుకోలేని దుస్థితిని వీరు ఎదుర్కొన్నారు.

## ఎల్ డీసీ నుంచి ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ దాకా..

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో సమ్మయ్య ఎల్ డీసీ స్థాయి నుంచి ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ వరకు కార్మికులు, యాజమాన్యాలు, పెన్షనర్లకు ఎనలేని సేవలు అందించారు. పనిచేసిన ప్రతిచోట అలుపెరుగని సేవలు చేసి అందరితో ప్రశంసలు అందుకున్నారు. ముఖ్యంగా తిరుపతి పీఎఫ్ కార్యాలయంలో పనిచేసిన సందర్భంలో.. సంస్థకు చెందిన అధికారులు, ఉద్యోగులు తిరుపతి శ్రీవారి దర్శనానికి వచ్చినప్పుడు తన వంతు సహాయంగా దర్శన ఏర్పాట్లు చేశారు. పీఎఫ్ సంస్థ చేపట్టిన కొత్త పథకాలు, అంశాలను యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు తెలియపరుస్తూ వారిలో అవగాహన, చైతన్యం తీసుకొచ్చారు. ఏ పోస్టులో పనిచేసినా అంకితభావంతో పనిచేస్తూ.. వీలైనంత సహాయం చేయాలనే సంకల్పంతో మూడున్నర దశాబ్దాలు ముంద్రాతి సమ్మయ్య సేవలందించారు.

# గ్రామాభివృద్ధికి మొదటి ప్రాధాన్యం

- సీఎస్ఆర్ నిధులతో పరుగులు పెడుతున్న పనులు
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ సంస్థల యజమానులు తమ సీఎస్ఆర్ నిధులతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం శుభ పరిణామమని పంచాయతి రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు మొదటి అడుగు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శనివారం ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్, ఓపెన్ టెక్ట్స్ కార్పొరేట్ సంస్థ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థల అధికారులు మారుమూల గిరిజన గ్రామాలను దత్తత తీసుకోవడం హర్షించదగిన విషయమన్నారు. జిల్లాలోని ఏడు గ్రామాలను నాలుగు నెలల క్రితం దత్తత తీసుకొని గ్రామ సభల్లో ప్రజలు నిర్ణయించిన పనులను పూర్తి చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. జగ్గన్నపేట గ్రామంలో విద్యార్థినీ, విద్యార్థులకు మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు ఆట వస్తువులను అందజేశారని, సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం ఆర్ఓఆర్ ద్వారా మంచినీటిని అందించనున్నారన్నారు. ఇదే తరహాలో ఎల్బీనగర్ గ్రామ ప్రజల కోరిక మేరకు ఆటో, సైకిళ్లు గేదెలను అందించారని వివరించారు. కార్పొరేట్ సంస్థల యజమానులు గ్రామీణ ప్రాంతాలను మరో మూడు సంవత్సరాలు దత్తత తీసుకున్న పక్షంలో గ్రామీణ ప్రాంతాలు పట్టణ ప్రాంతాలుగా మారిపోయే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుండగా మరోవైపు కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులు వెచ్చిస్తూ కార్యక్రమం చేపట్టడం చెప్పుకోదగిన విషయమన్నారు. సీఎస్ఆర్ నిధులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం ములుగు మండలంలోని ఇంచెంచెరువు పల్లెలో సర్వీస్ నౌ సంస్థ ద్వారా రూ.25.50 లక్షలతో గిరిజన గ్రామ దత్తత అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సీతక్క, నిర్మాణ్ ఆర్గనైజేషన్, మయూర్ పట్నాల, సర్వీస్ నౌ సంస్థ ప్రతినిధులు విద్యానంద, స్నేహలత, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 139 మంది మహిళలకు పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ టెక్ట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్–ఇంజనీరింగ్, సైట్ లీడర్, సైట్ సంగీత యనమంద్ర, వ్యవస్థాపకులు, గ్లోబల్ సీఈఓ, నిర్మాణ్ ఆర్గనైజేషన్, మయూర్ పట్నాల, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**ఉపకరణాల పంపిణీ..**

దివ్యాంగుల ఆత్మగౌరవమే ప్రజా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ చేస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. శనివారం ఏటూరునాగారం మండల కేంద్రం లోని గిరిజన భవన్ లో జిల్లా సంక్షేమ అధికారిణి కూచన శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగులతో కలిసి మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఏటూరునాగారం ఏఎస్ పీ శివం ఉపాధ్యాయ, ఆర్ డీఓ వెంకటేష్, ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఈపీ.ప్రేమలత, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పూజారి మాణిక్యం, భాస్కర్, వివిధ సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్వైజర్లు, డీడబ్ల్యూఓ కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, దివ్యాంగుల శాఖ సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, ఎఫ్పార్వో గణేష్, డీహెచ్ఈడబ్ల్యూ డీఎంసీ రమాదేవి, వివిధ అనుబంధ విభాగాలైన డీసీపీయూ, సీహెచ్ఎల్, సఖి, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, అలింకో సంస్థ ప్రతినిధులు సాయి, లబ్ధిదారులైన దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.



## వాణి స్కూల్ లో ఓపెన్ హౌజ్

- ఎల్కేజీ, యూకేజీ పిల్లల ప్రత్యేక కార్యక్రమం
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, పేరెంట్స్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 32వ డివిజన్ శిరంగి రాజా రాం తోటలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకోసం ప్రత్యకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం పేరెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొని తమ పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను ప్రత్యక్షంగా తిలకించారు. ఉపాధ్యాయుల సమక్షంలో పేరెంట్స్ తమ చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను ఉపాధ్యాయులతో పంచుకున్నారు. తౌలుల పాఠశాల ప్రిన్సిపాల్ సామల స్వరూప, కరస్పాండెంట్ సామల సుధాకర్, డైరెక్టర్లు మురళీకృష్ణ, సాయికృష్ణ, లావణ్య, హరిప్రియ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.

## కాజీపేట స్థాయి తగ్గించొద్దు

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, కాజిపేట :** కాజీపేట రైల్వే క్రూ కంట్రోల్ నుంచి లోకో పైలెట్స్, అసిస్టెంట్ లోకో పైలెట్లను, గార్డులను విజయవాడకు, ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తప్పుబట్టారు. కాజీపేట రైల్వే సంగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా ఖండించారు. కాజీపేట ను రైల్వే డివిజన్ కేంద్రం చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య నేతృత్వంలో కృషి చేస్తుంటే కొందరు అధికారులు లోపాయికారి కుట్రతో కాజీపేట రైల్వే డివిజన్ స్థాయిని తగ్గించడానికి కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి పలు విభాగాలను తరలిస్తూ నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, జిల్లా అధికార ప్రతినిధి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుస్, బంక సంపత్ యాదవ్, షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, తమ్మడి మానస, బబ్లు, దువ్వ రాజు, దువ్వ రేవతి, గుర్రం అమర్నాథ్ పాల్గొన్నారు.



## జాని కుటుంబానికి అండగా నిలుస్తాం..

**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ అధ్యక్షులు శ్రీనివాస్**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అనేక సంవత్సరాలపాటు జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగి, ఇటీవల వివిధ కారణాలతో వృత్తికి దూరంగా ఉంటున్న జర్నలిస్ట్ యాకూబ్ జాని కుటుంబానికి అండగా ఉంటామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో గతంలో ప్రముఖ పత్రికలో జర్నలిస్ట్ గా పనిచేసిన యాకూబ్ జాని అనారోగ్య కారణాలతో శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా అంతిమ సంస్కారాల కోసం గార్ల మండల శాఖ ఆధ్వర్యంలో రూ.6వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) గార్ల మండల అధ్యక్షులు నేలం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రూపన్ శంకర్, కోశాధికారి శ్రీకాంత్, యూనియన్ జిల్లా నాయకులు రావూరి ప్రశాంత్, షేక్ బుడాన్, తోడేటి రాము, మండలం యూనియన్ బాధ్యులు, జర్నలిస్ట్ లు, సీపీఎం జిల్లా కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, నామా సైదులు, వివిధ రాజకీయపక్షాల, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## ఎంజీఎంను ప్రక్షాళన చేయండి..

- తక్షణమే సమస్యలు పరిష్కరించాలి
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- కలెక్టర్ సత్య శారదకు వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పేదలకు అత్యంత మెరుగైన వైద్యం అందించాల్సిన ఎంజీఎం ఆస్పత్రిని యుద్ధప్రాతిపదికన ప్రక్షాళన చేయాలని, వెంటనే తగిన నిధులు కేటాయించి సమస్యల్ని పరిష్కరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. ఎంజీఎంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద కు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్ తో గంట రవికుమార్ మాట్లాడుతూ ఏళ్ల నుంచి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేని తనంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి అధ్వాన్నస్థితికి చేరిందన్నారు. ఆస్పత్రిలో సరిపడా బెడ్లు, వీల్‌చైర్లు, స్ట్రేచర్లు లేవని వాపోయారు. దశాబ్ద కాలంగా ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా, వేలాది మంది ప్రాణాలు కాపాడిన ఎంజీఎం ఆస్పత్రి.. పాలకుల నిర్లక్ష్య వైఖరితో దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఖాళీలను భర్తీ చేయడంపై ప్రభుత్వాన్ని రవికుమార్ తప్పుబట్టారు. ఎంజీఎంకు ఇంచార్జి సూపరింటెండెంట్‌తోనే కాలం వెల్లదీస్తున్నారని, దాంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది డబ్బుల కోసం రోగులను పీక్కుతుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిటీ–ఎంజోగ్రామ్, ఆక్సీజన్ ప్లాంట్ యంత్రాలు వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ, ఆర్‌సీయూ వార్డులో వంద పడకల చొప్పున అదనపు బెడ్లు వేయాలన్నారు. ఎంజీఎంలో వైద్య సేవలు అధ్వానంగా మారడంతో పేదలు పడరానిపాట్లు పడుతున్నారన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చేతగాని దద్దమ్మలుగా చూస్తూ ఉన్నారని రవికుమార్ విమర్శలు గుప్పించారు. ఎంజీఎంలో మరుగుదొడ్లు కంపుకొడుతున్నా ఎవరికీ పట్టడం లేదని మండిపడ్డారు. అంతేకాదు వార్డుల్లో ఫ్లోరింగ్ ఎక్కడికక్కడే ఊడిపోయిందని, పైకప్పు నుంచి పెచ్చులు ఊడుతున్నాయని వాపోయారు. ఫ్యాన్లు కూడా పనిచేయకపోవడంతో కొందరు ఇంటినుంచి తెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, మాచర్ల దీన్ దయాల్, గడల కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, వరంగల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com